
# పాచికలు

ఎస్.ఎస్.ఎస్. జవహర్‌లాల్




**గిర్రున** తిరిగే స్ప్రింగ్‌ఛెయిర్‌లో కూర్చున్నాడు వామనరావు. పరమ కోపంగాను, అతి చికాగ్గాను ఉంది అతని ముఖం. మతోన్మాది మనస్సులాగా భయంకరంగా ఆలోచిస్తున్నాడు.

ఒకటా...రెండా..., సాక్షాత్తూ పది హేను వేల రూపాయలు. ఒక్కసారిగా తన బాంక్ ఎక్కౌంటులోంచి హటాత్తుగా తరిగిపోయినయి.

కాలేజీ హోపెన్ రోజులలో కొన్ని రసీదుల తోను, కొన్ని లేకుండానూ డొనేషన్ల కని, వెల్‌ఫేర్ స్కీమ్సుకని, కల్చరల్ ప్రోగ్రామ్సుకని, జింఖానాంకని వగైరా వగైరాలంకని, కొత్తగా జేరే స్టూడెంట్సుని అదరగొట్టి, తప్పులెక్కల నైపుణ్యంతో మిగుల్చుకునే తన వాలు గేండ్ల వాటా మొత్తం. ఎకౌంట్ బుక్‌లోని ఎర్ర సిరాతో పదిహేను వేల రూపాయల తరుగు నిస్సహాయంగా చూస్తున్నాడు.

అసలు చిన్న చిన్న ఏజి టేషన్సుకు స్టూడెంట్ స్ట్రయిక్స్‌కు, హర్తాళ్ళకు భయపడే చిన్న ప్రాణంగాడు వామనరావుది. కాలేజీలో సిలబస్ అవలేదని గొడవ పెడుతున్నా పట్టించుకోని దొడ్డ మనసు గల ప్రిన్సిపల్ వామనరావు. గొంతులు చించుకుని విద్యార్థులు ఆటుపట్టింటే సోడా గాస్ ఎమోషన్స్‌లే అని తెలిసిన వాడిలా దర్జాగా ముసి ముసి నవ్వులతో కనబడతాడు. అలా నవ్వడం వామనరావుకు ఒక కళ. ఆ కళే లేకపోతే ఈ పాటికి వామనరావు అస్తిత్వానికి ఎప్పుడో ప్రమాదం వాటిల్లేది. ఆ కాలేజీ విద్యార్థుల్ని, చుట్టు ప్రపంచాన్ని పిల్లుల్ని చేసి పాల్లాంటివి పట్టడం అలవాటు చేసింది.

అంతటి ఎదురులేని మనిషి తొలి సారిగా చిక్కుల్లో పడ్డాడు.

దారుణంగా వోడిపోయాడు.

బోనులోకి పోబోతున్న ముద్దాయిలా, పరీక్షల్లో కాపీ కొడుతూ పట్టుబడ్డ విద్యార్థిలా గుండె మగ్గ పట్టుకుని విలవిల్లాడిపోయాడు. ఏనాడో చేసిన పాపం అర్థాంతర దావానలంలా ఇలా ముంచెత్తుకొస్తుందని అతనూహించ లేదు.

సీతారత్నం...వన్నెల విసనకర్ర...

ఐదేళ్ళ నాటి రాత్రి ముప్పై మూడు నిమిషాల విలాసాన్ని ఇంకా ఎలా గుర్తుంచుకొంది ఈ సీతాకోకచిలుక. అయినా, తనేం అన్యాయంగా కక్కుర్తి పడలేదే. తనేమీ సీతారత్నాన్ని బంధించి, హింసించి బలాత్కరించలేదే. కొవ్వెక్కిన నెరజాణలా తన నవే పురిగొల్పింది.

తన దయాదాక్షిణ్యాలకు వంగి, ఒంపుసొంపులు చూపుతూ తనుగా దగ్గరకొస్తే... ఉప్పుకారం తినే మనిషేకదా తను కూడా!

అసలు సీతారత్నంతో తన రాసక్రీడ ఒక ఏక్సిడెంట్ ఏదో విద్యావిధానం మీద రాసిన పుస్తకం—గూడుపుటానీగా తన కాలేజీలో ప్రతివానికి అమ్మించమంది. హాస్టల్ గ్రాంట్సుకి సిఫార్సు చేయమంది. ససేమిరా అన్నాడు వాటాలు తెలియక. కవచాలం చేసింది. ఆవె వేళ్ళలోంచి అనేక సందేశాలిచ్చింది. వంకీల జుట్టు. పెద్దదనిపించే ముక్కు, బుగ్గల మీద ఒకటి. రెండు మొటిమలు. చెప్పొద్దు... మత్తుగా సీతారత్నం మీద వాలా డతను.

సీతారత్నం తనని గట్టి చిక్కుల్లో పడవేసింది. ఎవరికి చెప్పుకోలేని జబ్బుతో విలవిల్లాడి పోయాడు చాలాకాలం తను. అబ్బ. ఎంత తప్పు చేశాడు. తనను ఎంతగా మోసగించింది. పాపిష్ఠి దానికి ఎందుకింత పగ! బహుశ అనుభవించాక కూడా తన వాటా మూడు వంతులు గుంజుకున్నావని కాబోలు. వాట్ ఎ రివెంజి! తన ఉద్యోగానికే ముప్పు తెచ్చింది. పరువు మర్యాదలకే ప్రమాదం తెచ్చింది. పిటీషన్లను ప్రోత్సహించింది.

ఆ రోజు మీటింగులో సీతారత్నం డిప్యూటీసెక్రటరీగారి పక్కన నుంచుంది. పీడ విరగడై ఎక్కడో చచ్చిపోయుం దేమో అని మరిచిపోయిన తనకు దయ్యంలా కనిపించింది. క్రూరంగా చూసింది. విద్యామంత్రి కార్యాలయంలో జండా వుఃరేశానని కాబోలు ఆ చూపు.

కళ్ళకు గోల్డ్ ఫ్రేమ్ రిమ్‌లెస్ జోడు. వూరంతా కనబడేటట్టు వేలాడే నల్లపూసల గొలుసు. పావలా కాసంత బొట్టు. పూర్తిగా మారిపోయింది. సీతారత్నం స్టయిల్. ఎంత ప్రాముఖ్యంలోకి వచ్చింది... ఆశ్చర్యం.

చూచాయగా తెలిసింది.

ఎంక్వయిరీ రిపోర్టు తనకు వ్యతిరేకంగా ఉందని, ప్రభుత్వాధికారి తనపై డ్రాస్టిక్ ఏక్షన్ తీసుకోవల

సిందిగా సిఫార్సు చేశాడని.

కిరీటం పోతూందని తెలుసుకున్న ముఖ్యమంత్రిలా మథనపడిపోయాడు. మరీ మరీ ఆలోచించాడు. కష్టాలను అధిగమించాలంటే ప్లానింగ్ ఉండాలి. బుర్రని పాదరసంలా పని చేయించాలి. సెక్రెటేరియెట్‌లో సీతారత్నం పవర్‌ఫుల్. తనేం చేస్తే బాగుంటుంది?

జీవిత చదరంగంలో పావికలు వెయ్యాలి. పావులు నడిపించాలి. తళుక్కుని మెరిశాడు వీరినాయుడు.

అధికార వర్గంలోని రాజకీయ నాయకుడు విద్యామంత్రిగారికి దూరపు బంధువు. అంతకంటే ఏం కావాలి?

ఆ తరవాత.

బీరుసీసాలు, స్కాచ్ విస్కీలు, బిర్యానీలు, చికెన్ రోస్టులు. రాస క్రీడలు... రేసుకోర్సులు... పార్టీలు.. పూలదండలు... ఎంతెంత డబ్బు... ఎంత ఖర్చు. పదిహేనువేల రూపాయలు ఒకటా....రెండా...! రెక్కలొచ్చినట్లెగిరి పోయాయి. ఐస్ ముక్కల్లా కరిగి పోయాయి. డబ్బు లవణంలా కరిగి పోయింది. కర్పూరంలా ఆవిరై పోయింది. ఎలాగైతేనేం వీరినాయుడు మచ్చికయ్యాడు.

ఎక్కిన కారు ఎక్కకుండా నాలుగు రోజు లటూ ఇటూ తిరిగి, ఆ ఫైలు ఈ ఫైలు మంత్రిగారి వద్దకు పరిగెత్తించాడు. తెలుగు సినిమాలో విలనులా విరగబడి నవ్వుతూ గర్వంగా చూశాడు. రిపోర్టు తాలూకు నాలుగు కాగితాలకు నిప్పంటించాడు తాపీగా. సీతారత్నంకు సవాల్‌గ తన ప్రెస్టేజీ పెంచేశాడు.

లేకపోతే... ఈ పాటికి...


తన డిగ్నిటీ... ఏంగానూ?

పరువు మర్యాదా... నడి వీధుల్లో అబ్బబ్బ... తలుచుకుంటేనే లో— ప్రెషర్‌తో నీరసం వచ్చేస్తోంది. మంచి నాక్‌తో గట్టెక్కాడు. బంధువర్గాన్నుద్ధరించిన ఆ మంత్రిగారి చలువ... ప్రామిసింగ్ మినిస్టర్...అంతా ఆ వీరి నాయుడి దయ.

బతికి బయట పడ్డాడు తను. బోలెడంత బుద్ధొచ్చింది. రోజులు బాగుండలేదు. అలవాట్లను అదుపులో పెట్టాలి. తనేమిటో, తన పనేమిటో ముక్కుకు సూటిగా చేసుకోవాలి. స్ట్రిక్ట్‌గా, సీరియస్‌గా ఉండాలి ఇహ నించి. వామనరావు నిశ్చయించుకున్నాడు. ఎందుకో ఇంగ్లీషు లెక్చరర్ కిరణ్ ఎదురుగా నుంచున్నాడు.

• • •

క్లాస్‌లో అల్లరి ప్రారంభమయింది. ఇంటర్ ఫస్ట్ ఇయరు. ముందు వరసలో




కూర్చున్న అమ్మాయిల మీద కామెంట్స్ చేస్తున్నారు. వెనుక బెంచీ విద్యార్థులు వోపెనింగ్ రోజులు. కొత్త వాతావరణం ఆడ పిల్లలను ఏడిపించటం అదో ఆనందం వాళ్ళకి.

వాసంతిని చూచి మాటలు విసురు తున్నారు.

"క్లియోపాత్రలా, అవ్‌లీగా ఉందిరా!"

"ఎలిజబెత్ టేలర్‌లా సెక్సీగా ఉందిరా..."

"క్లియోపాత్ర విరహంలో ఏమందో తెలుసా? 'ఆంటోనీని మోసే ఓ గుర్రమా! నా కంటే నీవే అదృష్ట వంతురాల' నందిరా." మిత్రబృందం ఘొల్లుమన్నారు. వాసంతి వినలేక పోయింది. రయ్‌మని లేచి వెనక్కి తిరిగింది. ఆమె కళ్ళలో నిప్పులు కురుస్తున్నాయి.

"కుక్కల్లా మొరగకండి యూ డర్టీ... బ్రూట్స్."

"బ్రూటస్‌ని ప్రేమిస్తానంటూంది రోయ్..."

"కమాన్! డార్లింగ్ నేనే బ్రూటస్‌ను!"

భుజాలెగరేస్తూ ఏ మాత్రం తొణక కుండా ముందుకొచ్చాడు సారథి.

సరిగ్గా అదే సమయానికి ఇంగ్లీషు లెక్చరర్ కిరణ్ అడుగు పెట్టాడు. ఎవరూ ఏమీ మాట్లాడలేదు. గప్‌చిప్‌గా సర్దుకున్నారు. కిరణ్ పాఠం చెప్పడం మొదలు పెట్టాడు. పాఠం చెబుతున్న కిరణ్ వైపే తదేకంగా, అందరూ శ్రద్ధగా వింటున్నారు. ఉన్నట్లుండి వాసంతి కెవ్వుమని కేకవేసింది. తన వెనకనే కూర్చున్న సారథి వైపు తీవ్రంగా చూసింది.

"యూ డర్టీ రోగ్ ..." నిశ్శబ్దంగా క్లాసులో వాసంతి మాటలు గుడి గంటల్లా ప్రతిధ్వనించాయి. ఆమె దగ్గరకు వచ్చి ఆత్రతగా అడిగాడు కిరణ్. వాసంతి ఏమీ మాట్లాడలేదు. ప్రక్కన కూర్చున్న జయంతి మాత్రం సారథి వెనకబెంచి నుంచి వాసంతి జడ లాగాడని చెప్పింది. ఉక్రోషం, కోపం, సిగ్గు నిండిపోయిన వాసంతి కళ్ళలో కన్నీరు కూడా తళుక్కు మంది. పూర్తిగ తెలిసిపోయింది కిరణ్‌కి.

"సారథి! గెట్ అవుట్ ఆవ్ ది క్లాస్." కిరణ్ కోపంగా గర్జించాడు.

"నేనేం తప్పు చేశానని? పొర బాటున జడ బారుగ ఉందేమో తగిలింది." గీరగా కాలర్ సర్దుకుంటూ అన్నాడు సారథి.

క్లాసంతా ఆశ్చర్యంగా చూస్తోంది.

కిరణ్ అభిమానం దెబ్బతింది. కోపాన్ని నిగ్రహించుకున్నాడు. అదే సమయానికి పీరియడ్ అయిపోయిందని చెప్పే, ఎలక్ట్రికల్ బెల్ గణగణమని మోగింది.

• • •

"నా డార్లింగ్ డాటర్‌ని ... టీజ్ చేస్తాడా. ఎవడా స్కౌండ్రల్?" వామన రావు మాటలు ఉరుముల్లా ప్రతిధ్వనించాయి.

"కిరణ్ మీ స్టేట్‌మెంటు కూడా రెడీ చెయ్యండి. ఆ డర్టీ ఇడియట్‌ను ఎక్స్‌పెల్ చేస్తాను కాలేజీ నుంచి. నాకు డిసిప్లిన్ ఫస్ట్. ఎవ్విరిథింగ్ నెక్స్ట్."

"అంతెందుకు లెండి. కాలేజీలో క్రొత్తగా చేరారు. ఎవరు ఏమిటో అతనికి తెలియదు. సీరియస్ వార్నింగ్ ఇవ్వండి." కిరణ్ సూచించాడు.

"నో...నో, కిరణ్! అలా వదిలేస్తే ఏమనుకుంటారు? ప్రిన్సిపాల్ కూతురికే లేదు రక్షణ అంటూ కాలేజీకే ఎంత బాడ్ నేమ్. వాట్ ఎబౌట్ స్టాండర్డ్స్ ఆఫ్ డిసిప్లిన్. ఇన్‌స్టిట్యూషన్ నడపాలా మయ్యాలా? వేరీజ్ హి...కాల్ దట్ బాడ్ బాయ్." ఇంచుమించు అరుస్తున్నాడు ప్రిన్సిపాల్ వామనరావు.

• • •

"అర్ధాంతరంగా విశాఖపట్నంలో చేర్చారేమిటండీ వాసంతిని? వాడెవడో జడ లాగితే ఒళ్ళు హూనంచేసి కాలేజీ నుంచి గెంటించక ఇదేం ఖర్మ..."

భార్య మాటలకు వామనరావు బుర్ర గిర్రున తిప్పుతోంది.

"మీరేం ప్రిన్సిపాలండీ బాబూ! మీ దసలు కాలేజీనా, కూరగాయల మార్కెట్టా? ఇదేం అన్యాయం?" ఏడాది పొడుగునా పట్టిన ఇంటెల్లపాది బూజుని దులిపేస్తున్నట్లు దులిపేస్తోంది భార్య వామనరావును.

"రాజ్యం! ఏ విషయం తెలియ కుండ అనవసరంగా మాట్లాడకు. పిల్లలు మన దగ్గర ఉండి చదువుతే ఎటాచ్‌మెంట్ పెరిగిపోయి చదువుల్లో పైకి రారు. దాన్ని రీసెర్చ్ స్టూడెంట్‌ని చేయాలని నా ఆశయం ... అందుకని ఇప్పట్నించే అక్కడ ..."

వామనరావు చెప్పుకుపోతుంటే కళ్ళప్పగించి వింటోందిభార్య. ముద్దుల కూతురు జడలాగిన పోకిరి వెధవ తనను కాపాడిన వీరినాయుడి కుమార రత్నమని భార్యకు చెప్పలేదు. అసలు ఎలా చెప్పగలడు? గుండె దడదడలాడిపోతుంది తలుచు కుంటే. పదిహేనువేల రూపాయల్ని పరువు మర్యాదల ప్రకరణంలో సీతారత్నం నాయకుడిలా నిలిచాడు — మరి ఆ వీరినాయుడు తనకి. ★